

ఆగని పచ్చమూకల ఆగడాలు

మర్రిపూడి మండలం వెంకటకృష్ణాపురంలో గ్రామకంఠం భూమిని టీడీపీ సానుభూతి పరులు ఆక్రమించి శాశ్వత కట్టడాలు చేపట్టారు.

- 8లో..



అబద్ధాలు చెప్పడం బాబుకు అలవాటు

అబద్ధాలు చెప్పడం సీఎం చంద్రబాబుకు అలవాటని వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు విమర్శించారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
36 /28

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పీజీ సెట్‌లో చీమకుర్తి విద్యార్థిని ప్రతిభ



చీమకుర్తి: పీజీ సెట్ ఫలితాల్లో చీమకుర్తికి చెందిన విద్యార్థిని ఆకురాతి ఉమామహేశ్వరి రాష్ట్రస్థాయిలో ఫస్ట్ ర్యాంక్ సాధించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. జాతీయ స్థాయిలో 932వ ర్యాంక్ సాధించినట్లు తండ్రి ఆకురాతి రంగారావు వెల్లడించారు. గుంటూరులోని ప్రైవేటు కాలేజీలో బీ ఫార్మసీ చదివిన ఉమామహేశ్వరిని ఆ కాలేజీ యాజమాన్యంతో పాటు తల్లిదండ్రులు, బంధువులు అభినందించారు.

మద్యం దుకాణాలపై నిరంతర పర్యవేక్షణ

- ఎక్సైజ్ ఈఎస్ ఆయేషా బేగం



ఒంగోలు టౌన్: జిల్లా వ్యాప్తంగా మద్యం దుకాణాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని ఎక్సైజ్ ఈఎస్ షేక్ ఆయేషా బేగం తెలిపారు. గురువారం స్థానిక జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో విలేకరులతో ఆమె మాట్లాడారు. ఎక్సైజ్ రూల్స్ 2024ను జిల్లాలోని మద్యం దుకాణదారులంతా తప్పని సరిగా పాటించాలని కోరారు. నిబంధనలకు అనుగుణంగా ఉదయం 10 గంటలకు దుకాణాలు తెరవాలని, తిరిగి రాత్రి 10 గంటలకల్లా మూసివేయాలని ఆదేశించారు. లైసెన్స్‌దారులందరూ ప్రభుత్వానికి సహకరించాలన్నారు. ఇటీవల తీసుకున్న చర్యల ఫలితంగా ప్రస్తుతం జిల్లాలో ఎక్సైజ్ యాప్ 99 శాతానికి చేరుకుందని, ఎమ్మార్పీ ధరలు, సమయపాలన అమలు విషయాలను తెలుసుకునేందుకు ఏర్పాటు చేసిన క్యూ ఆర్ కోడ్ గతంలో కేవలం 20 శాతం మాత్రమే ఉండగా, ప్రస్తుతం 100 శాతానికి చేరుకుందని చెప్పారు. కమిషనర్ కార్యాలయానికి అనుసంధానంగా ఉండేలా ప్రతి మద్యం దుకాణంలో సీసీ కెమెరాల స్ట్రీమింగ్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో 188 మద్యం దుకాణాలు ఉండగా, ఇప్పటి వరకు 119 దుకాణాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎస్‌హెచ్ఓల ద్వారా ఏ4 షాపులను తనిఖీలు చేయించి సర్టిపై చేయించడం జరుగుతుందన్నారు. సర్టిపై వివరాలను ఎప్పటికప్పుడు డీపీఓ కార్యాలయానికి సమర్పించేలా ఆదేశాలిచ్చినట్లు తెలిపారు.

వక్ఫ్ భూముల సాగుకు వేలం

ఒంగోలు వన్‌టౌన్: జిల్లాలోని వక్ఫ్ భూములను మూడేళ్ల పాటు సాగు చేసేందుకు వేలం నిర్వహించనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి జె.పార్థసారథి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ స్టేట్ వక్ఫ్ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి ఉత్తర్వుల మేరకు జూలై 2025 నుంచి జూన్ 2028 మూడేళ్ల సాగు చేసుకునేందుకు వేలం నిర్వహిస్తామన్నారు. ముందస్తుగా రూ 10,000 చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. గతంలో బకాయిలు ఉన్న వారు వేలంపాటకు అనర్హులని తెలిపారు. వేలం ముగిసిన తర్వాత మొత్తం చెల్లించి తగు రశీదు జిల్లా ఇన్‌స్పెక్టర్ ఆడిటర్ నుంచి పొందాలన్నారు. వివరాలకు వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ 7331157343 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.



జాతీయ రహదారిపై వెల్లంపల్లి వద్ద రాస్తారోకోలో నినాదాలు చేస్తున్న పొగాకు రైతులు

పొగాకు కంపెనీలు, బోర్డు అధికారుల తీరుపై కడుపుమండిన రైతులు వేలాన్ని బహిష్కరించారు. రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేశారు. గిట్టుబాటు ధర సంగతి అటుంచితే.. అమాంతం రేట్లు తగ్గించేస్తుండటంపై భగ్గుమన్నారు. ఇటీవల కాలంలో ఎన్నడూలేని విధంగా కనీస ధర రూ.125కు తగ్గించేయడం సరికాదంటూ నిలదీశారు. అలాగే చిన్నచిన్న సాకులు చూపిస్తూ నోబిడ్ పేరుతో తెచ్చిన బేళ్లను వెనక్కు పంపిస్తున్నారంటూ మండిపడ్డారు. రైతుల పక్షాన నిలవాల్సిన బోర్డు అధికారులు బయ్యర్ల వైపు మాట్లాడుతున్నారంటూ ఆక్షేపించారు. వేలం కేంద్రాల్లో తీరుమారకపోతే ఆత్మహత్యలే శరణ్యమంటూ ఆవేదన చెందారు. రైతులకు ఇంత అన్యాయం జరుగుతున్నా పాలకులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ధర పొగ పట్టి.. రైతు కడుపు మండి..

- ధరలు తగ్గించేస్తూ నిలువు దోపిడీ
- ఈ సీజన్‌లో కనిష్ట ధర రూ.125
- ఇలా అయితే ఆత్మహత్యలే గతి
- వెల్లంపల్లి, కొండపి కేంద్రాల్లో వేలం బహిష్కరించి రాస్తారోకోలు
- మద్దిపాడులోని జాతీయ రహదారిపై పొగాకు దహనం
- కొండపి-టంగుటూరు రహదారిపై ఆందోళన
- బోర్డు అధికారులు, కంపెనీల తీరుపై నిరసన
- రెండు చోట్లా భారీగా నిలిచిపోయిన వాహనాలు



కొండపి-టంగుటూరు రహదారిపై ధర్నా చేస్తున్న పొగాకు రైతులు

మద్దిపాడు/కొండపి:

గతేడాది వరకూ పొగాకు రైతుకు స్వర్ణయుగం. నాలుగేళ్లుగా లాభాలు చవిచూశారు. బోర్డు నిర్దేశించిన దాని కంటే అదనంగా సాగు చేసినా మంచి ధరలే వచ్చాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతుల పక్షాన నిలిచి మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి వ్యాపారుల ఆధిపత్యానికి గండికొట్టింది. ఇక తప్పకపోవడంతో పోటీలు పడి మరీ పొగాకు కొనుగోలు చేశారు. గతేడాది పొగాకు చరిత్రలో రికార్డు ధర కేజీకి రూ.366 పలికింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. 2019 ముందు చరిత్ర పునావృతమైంది. కంపెనీలు రైతులను దగా చేయడం మొదలెట్టేశాయి. సాగు సమయంలో మీరు ఎంతైనా చేయండి అంటూ నమ్మబలికి కొనుగోలు సమయానికి అసలు స్వరూపాన్ని చూపించాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టించుకోవాల్సిన ప్రభుత్వం ఆర్భాట ప్రకటనలకే పరిమితమవుతోంది. మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తున్నామంటూ మాయమాటలు చెబుతోంది. గురువారం వెల్లంపల్లి, కొండపి మండలాల్లో రైతుల నిరసనలు వాస్తవ పరిస్థితులకు అద్దం పడుతున్నాయి. వేలాన్ని బహిష్కరించి రైతులు రోడ్డెక్కారు. వెల్లంపల్లి వేలం కేంద్రం పరిధిలోని రైతులు జాతీయ రహదారిపై మద్దిపాడు వద్ద రాస్తారోకో నిర్వహించగా, కొండపి వేలం కేంద్రం పరిధిలోని రైతులు కొండపి-టంగుటూరు రహదారిపై ఆందోళనకు దిగారు. ఆ వివరాలిలా ఉన్నాయి...

మద్దిపాడు మండలంలోని వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రానికి ముండ్లమూరు క్లస్టర్ రైతులు గురువారం బేళ్లను తీసుకొచ్చారు. ధర పూర్తిగా తగ్గించి కొనుగోలు చేయడంతో పాటు ఎక్కువ శాతం నోబిడ్ కావడంతో రైతులు తీవ్ర స్థాయిలో అసంతృప్తికి గురయ్యారు. కంపెనీలన్నీ కుమ్మక్కై ధరలు పూర్తిగా దిగ్గోయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కిలోకి రూ.220 ఇస్తామని చెప్పిన కంపెనీలు.. రూ.180కి తగ్గించడం, ఆ తర్వాత రూ.160కి కొనుగోలు చేస్తామని చెప్పడం, చివరకు రూ.125కి కొనుగోలు చేయడంతో రైతులు వేలాన్ని బహిష్కరించారు. జాతీయ రహదారిపైకి చేరుకుని రాస్తారోకో చేశారు. పొగాకు తగలబెట్టి నిరసన వ్యక్తం చేశారు. జాతీయ రహదారిపై రెండువైపులా ట్రాఫిక్ భారీగా స్తంభించడంతో మద్దిపాడు పోలీసులు చేరుకుని రైతులను పక్కకు తరలించేందుకు ప్రయత్నించారు. తమకు న్యాయం జరిగేంత వరకూ జాతీయ రహదారిపైనే ఉంటామని రైతులు స్పష్టం చేయడంతో బోర్డు అధికారులతో పోలీసులు మాట్లాడారు. న్యాయం జరిగేలా చూస్తామని చెప్పడంతో ధర్నా విరమించి వేలం కేంద్రానికి చేరుకున్నారు. ఆర్‌ఎం లక్ష్మణరావుతో పొగాకు రైతు సంఘ నాయకులు అబ్బూరి శేషగిరిరావు, రామసుబ్బారెడ్డి, పల్లకి సత్యన్నారాయణరెడ్డి, పొగాకు రైతులు మాట్లాడారు. కంపెనీల ప్రతినిధులతో మాట్లాడి తిరిగి వేలాన్ని ప్రారంభించారు. కానీ, కంపెనీల తీరు మారకపోవడం, ఐదు బేళ్లకుగానూ ఒకటి కొనుగోలు చేస్తూ మిగిలినవి నోబిడ్ చేస్తుండడంతో రైతులు మరోసారి ఆందోళన వ్యక్తం చేశారు. వేలాన్ని నిలిపివేయాలని గట్టిగా కేకలు వేయడంతో కంపెనీల బయ్యర్లు పక్కకు వెళ్లిపోయారు. కంపెనీలకు బోర్డు అధికారులు మద్దతుగా నిలుస్తున్నారంటూ రైతులు వాగ్వాదానికి దిగారు. ఈరోజు కొనని కంపెనీలు రేపైనా కొంటాయా అంటూ ఆర్‌ఎం మాట్లాడడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. రైతులతో మాట్లాడిన ఆర్‌ఎం, వేలం సూపరింటిండెంట్ సత్య శ్రీనివాస్‌లు వేలాన్ని నిలిపివేసి శుక్రవారానికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

లో గ్రేడ్ పొగాకు కొనుగోలు చేయలేదని...

కొండపి పొగాకు వేలం కేంద్రానికి క్లస్టర్ పరిధిలోని జువ్విగుంట, అయ్యవారిపాలెం, తంగెళ్ల, జాళ్లపాలెం, పీరాపురం గ్రామాల రైతులు గురువారం వేలానికి పొగాకు బేళ్లు తీసుకొచ్చారు. ఆరు రౌండ్లు వేలానికి బ్రైట్ రకం పొగాకు బేళ్లను తీసుకొచ్చిన రైతులు.. అవి అయిపోవడంతో ఏడో రౌండ్లో లో గ్రేడ్ పొగాకు తీసుకొచ్చారు. లో గ్రేడ్ పొగాకును కనిష్ఠ ధర కేజీ రూ.160కి కూడా కొనుగోలు చేయక పోగా, బేళ్లను వ్యాపారులు తిరస్కరించడంతో వేలాన్ని బహిష్కరించి రైతులు ఆందోళనకు దిగారు. లో గ్రేడ్ పొగాకు బేళ్లను కూడా కొనుగోలు చేయాలంటూ వేలం కేంద్రం ఎదురుగా కొండపి-టంగుటూరు రహదారిపై బైఠాయించారు. ఇరువైపులా కిలోమీటర్ మేరకు వాహనాలు నిలిచిపోవడంతో పోలీసులు చేరుకున్నారు. ధర్నా విరమించాలని రైతులను కోరగా ససేమేరా అన్నారు. వేలం నిర్వహణ అధికారి జి.సునీల్ కుమార్, సిబ్బంది కలిసి రైతులతో చర్చల జరిపి లో గ్రేడ్ పొగాకు కూడా కొనుగోలు చేసే విధంగా బయ్యర్లతో మాట్లాడతానని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ వ్యాపారులు సిండికేటై ధరలు దిగ్గోస్తున్నారని ఆరోపించారు. సాగుచేసిన పొగాకులో 40 శాతం వరకు బ్రైట్ గ్రేడ్ పొగాకు పండిందని, ఇప్పటివరకు దానినే వేలానికి తీసుకొచ్చామని తెలిపారు. ఏడో రౌండ్ వేలానికి తమ వద్ద ఉన్న లో గ్రేడ్ పొగాకు తీసుకొచ్చామని, కానీ, కేజీ కనిష్ఠ ధర రూ.160 కూడా ఇవ్వకుండా వ్యాపారులు సిండికేట్‌గా మారి కొనుగోలు చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే గిట్టుబాటు ధర లేక అప్పుల్లో కూరుకుపోయామని ఆవేదన చెందారు. ఏడో రౌండ్‌లో అయినా గిట్టుబాటు ధర లభిస్తుందని ఆశిస్తే.. వచ్చిన బేళ్లను వ్యాపారులు తిరస్కరిస్తున్నారని వాపోయారు. గత ప్రభుత్వం ధరలు తగ్గినప్పుడు ప్రభుత్వ రంగ సంస్థ మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి రైతులను ఆదుకుందని, ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి రైతుల బాధలు పట్టడం లేదని విమర్శించారు.

ఆత్మహత్యలు చూడాల్సి వస్తుంది...

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రంగంలోకి దిగి ప్రభుత్వ రంగ సంస్థలతో పొగాకు కొనుగోలు చేయించి రైతులను ఆదుకోవాలని, లేకుంటే ఆత్మహత్యలు చూడాల్సి వస్తుందని పలువురు రైతులు హెచ్చరించారు. పచ్చాకు కూలీలకు, డ్రైవర్లకు నగదు ఇవ్వలేదని, వారు తమ ఇంటి చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. ఏడో రౌండ్ వరకు వేచి చూడాలని వారిని బతిమిలాడుకున్నామన్నారు. ఏడో రౌండ్‌లో కూడా గిట్టుబాటు ధర లభించకపోవడంతో కూలీలకు, డ్రైవర్లకు ఏం సమాధానం చెప్పుకోవాలో అర్థం కావడం లేదన్నారు. లేబర్ యాక్ట్ కింద కేసులు పెడతామని వారు బెదిరిస్తున్నారన్నారు. పాలకులు ఇలాంటి దారుణ పరిస్థితులు తమకు కలిపిస్తున్నాయని వాపోయారు. ఇప్పటికైనా వారు పొగాకు రైతులను ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘ జిల్లా నాయకులు గుల్లపల్లి వెంకట్రావు, రమణారెడ్డి, వెంకటరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి....



ఆరు రౌండ్ల వరకు బ్రైట్ రకం పొగాకునే వేలానికి తీసుకొచ్చాం. రైతుల దగ్గర ఉన్న బ్రైట్ రకం పొగాకు పూర్తిగా అయిపోయిన తర్వాతే ఏడో రౌండ్లో లో గ్రేడ్ పొగాకును వేలానికి తీసుకొచ్చాం. కానీ, వ్యాపారులు బ్రైట్ రకం మాత్రమే కొనుగోలు చేస్తామంటూ లో గ్రేడ్ పొగాకును తిరస్కరించారు. ఇప్పటివరకు అమ్మిన పొగాకు డబ్బులు ఖర్చులకు కూడా సరిపోవడంలేదు. లో గ్రేడ్ పొగాకును వ్యాపారులు తిరస్కరించడంతో ఏం చేయాలో అర్థం కావడం లేదు. లో గ్రేడ్ పొగాకు కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలి.

– బొల్లినేని లక్ష్మీనారాయణ, రైతు, జువ్విగుంట

గిట్టుబాటు ధర కల్పించాలి



పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి. వ్యాపారులు సిండికేట్ అయి ధరలు దిగ్గోస్తున్నారు. గత సంవత్సరం కేజీ రూ.360 పలికిన పొగాకును ఈ సంవత్సరం వేలంలో 240 నుంచి 250 రూపాయలకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. బ్యారన్‌కు రూ.5 లక్షల వరకు నష్టం వస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే జోక్యం చేసుకుని పొగాకు రైతులను ఆదుకుని గిట్టుబాటు ధర కల్పించాలి.

– కిరణ్, రైతు, జువ్విగుంట



కొండపిలో వేలం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్‌ను నిలదీస్తున్న రైతులు



వెల్లంపల్లిలో పొగాకు రైతులతో చర్చిస్తున్న ఆర్‌ఎం లక్ష్మణరావు



వెల్లంపల్లిలో వేలం నిర్వహణాధికారిని చుట్టుముట్టి వేలం నిలిపివేసిన రైతులు

డ్రగ్స్ రహిత జిల్లాగా ప్రకాశం

- నషా ముక్త్ భారత్ అభియాన్ అవగాహన ర్యాలీలో కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ దామోదర్
- పోలీసు శాఖ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, ఉద్యోగులు



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఎక్సైజ్ ఈఎస్

ఒంగోలు టౌన్:

డ్రగ్స్ రహితంగా ప్రకాశం జిల్లాను తీర్చిదిద్దుకునేందుకు ప్రతిఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలోని పరేడ్ గ్రౌండ్ నుంచి అద్దంకి బస్టాండు సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 8 వేలమందికిపైగా విద్యార్థులు, యువకులు, వివిధ శాఖల ఉద్యోగులు హాజరయ్యారు. పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన వివిధ కార్యక్రమాలలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసంగిస్తూ దేశానికి సంపద వంటి యువత డ్రగ్స్‌కు బానిసలుగా మారకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ప్రజలంతా కలిసికట్టుగా మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు ప్రతిన పూనాలన్నారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ భవిష్యత్తును ఉజ్వలంగా మార్చుకోవాలని విద్యార్థులు, యువకులకు సూచించారు. ఇందుకు తల్లిదండ్రులు, స్వచ్ఛంద సంస్థలు సహకరించాలని చెప్పారు.

ఎస్పీ ఏఆర్ దామోదర్ ప్రసంగిస్తూ సరదాగా మత్తుపదార్థాలు వాడి ఆ తర్వాత వాటికి అలవాటై పోతున్న వారు ఎక్కువగా ఉన్నారని తెలిపారు. ఒకసారి డ్రగ్స్ వినియోగానికి అలవాటు పడితే జీవితం నాశనం అవుతుందని, చివరికి జైలుకు వెళ్లడం, ఉద్యోగావకాశాలు కోల్పోవడం దాకా పరిస్థితులు తీసుకెళ్తాయని చెప్పారు. పాస్ పోర్టులు, వీసాల వంటివి రావని, సమాజంలో గౌరవం కోల్పోతారని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ డ్రగ్స్ వాడకూడదని సూచించారు. రానున్న రోజుల్లో ప్రతి పాఠశాల, కళాశాలల్లో కమిటీలు ఏర్పాటు చేసి విద్యార్థులకు డ్రగ్స్ వలన కలిగే దుష్ఫలితాలు వివరించేలా పెద్ద ఎత్తును అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే మాదక ద్రవ్యాలకు అలవాటుపడిన వారిని డీ అడిక్షన్ సెంటర్లో చేర్పించడం జరుగుతుందన్నారు. మాదక ద్రవ్యాలు సరఫరా చేస్తున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తామని చెప్పారు. డ్రగ్స్ నియంత్రణ, గంజాయిని అరికట్టేందుకు ప్రభుత్వం ఐజీ నేతృత్వంలో ప్రతి జిల్లాలో 30 మందితో ఈగిల్ అనే ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ఇప్పటి వరకు 41 కేసులు నమోదు చేసి 220 మందిని గుర్తించి జైలుకు పంపించడం జరిగిందన్నారు. మాదక ద్రవ్యాలకు అలవాటుపడిన వారి ప్రవర్తనలో మార్పు వచ్చేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. నిషేధిత మాదక ద్రవ్యాలు రవాణా చేసినా, విక్రయించినా, సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రగ్స్‌పై ఏదైనా సమాచారం ఉంటే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1972, స్థానిక పోలీసులు, డయల్ 112, పోలీసు వాట్సాప్ నంబర్ 9121102266కు తెలియజేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఈఎస్ షేక్ ఆయేషా బేగం, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్ విజయ కుమార్, డీఎస్పీలు రాయపాటి శ్రీనివాసరావు, లక్ష్మీ నారాయణ, నాగరాజు, రమణ కుమార్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు. డ్రగ్స్ వినియోగంపై కష్టనష్టాలను వివరిస్తూ నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

సాయం చేసేవారిని గుర్తించాలి

- పీ–4 పథకానికి ఎన్‌ఆర్‌ఐలు, ప్రైవేటు వ్యక్తులు, స్వచ్ఛంద సంస్థలను సంప్రదించాలి
- మార్గదర్శకులను గుర్తించడంలో అధికారులు వేగం పెంచాలి
- అధికారులు కూడా బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలి
- కలెక్టర్ తమీమ్ అన్సారియా



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

ఒంగోలు సబర్బన్: పీ–4 సర్వేలో గుర్తించిన కుటుంబాలకు సాయం చేసేవారిని సంప్రదించాలని జిల్లా అధికారులను కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆదేశించారు. ప్రకాశం భవనం నుంచి మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాగ్, ఒంగోలు ఆర్డీఓ లక్ష్మీప్రసన్న, కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, మండల స్థాయి అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులు కూడా హోదాతో సంబంధం లేకుండా ఆసక్తి ఉన్నవారంతా బంగారు కుటుంబాలను (పీ–4 సర్వేలో తేల్చిన కుటుంబాలు) దత్తత తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సదరు ఉద్యోగి, అధికారి బదిలీ అయినప్పటికీ ఆ హోదాలోకి వచ్చినవారు ఆయా కుటుంబాల యోగక్షేమాలను పర్యవేక్షించాల్సి ఉంటుందని తెలిపారు. వెట్టి చాకిరీ నుంచి విముక్తి పొందిన కుటుంబాలను తాను దత్తత తీసుకుని ఈ పథకం కింద వారికి తాను మార్గదర్శిగా ఉండాలని నిర్ణయించుకున్నానని కలెక్టర్ వెల్లడించారు. మార్గదర్శిగా ఉండటంలోనూ, మార్గదర్శకులను గుర్తించడంలోనూ తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలో 74 వేలకుపైగా బంగారు కుటుంబాలను ప్రాథమికంగా గుర్తించామన్నారు. వీరి అవసరాలను గుర్తించడంతోపాటు వాటిని సమకూర్చి ఆయా కుటుంబాలకు అండగా ఉండే మార్గదర్శకులను కూడా త్వరగా గుర్తించాలన్నారు. సహాయం చేసేందుకు ముందుకు వచ్చే ఎన్‌ఆర్‌ఐలు, ఇతర ప్రైవేటు వ్యక్తులు, స్వచ్ఛంద సంస్థలను గుర్తించాలన్నారు. ఎన్ని కుటుంబాలనైనా దత్తత తీసుకోవచ్చని, బంగారు కుటుంబం, మార్గదర్శకుల వివరాలను వెబ్‌సైట్లో ఏ విధంగా నమోదు చేయాలో జెడ్పీ సీఈవో చిరంజీవి వివరించారు. వీడియో కాన్ఫరెన్సులో డీఆర్ఓ బి.చినఓబులేసు, బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు, డీఎం అండ్ హెచ్ఓ వెంకటేశ్వర్లు, డీసీహెచ్ ఎస్.శ్రీనివాస నాయక్, డీఎస్ఓ పద్మశ్రీ, ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ జగన్నాథరావు, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అర్జున్ నాయక్, డీఆర్డీఏ పీడీ నారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాలశంకరరావు, జిల్లా బీసీ సంక్షేమ అధికారి నిర్మల జ్యోతి, గిరిజన సంక్షేమ అధికారి వరలక్ష్మి, జిల్లా మత్స్య శాఖ అధికారి శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఎస్ఈ వరలక్ష్మి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

ఒంగోలు: ఫెన్సింగ్ రాష్ట్రస్థాయి పోటీలకు పలువురు క్రీడాకారులు ఎంపికయ్యారు. స్థానిక మినీ స్టేడియంలో గురువారం అండర్ 10, అండర్ 12 విభాగాల్లో ఎంపిక ప్రక్రియ జరిగింది. బి.వెంకట సౌమ్య, డి.షణ్ముక ప్రియ, ఉజ్జయిని అల్లం, సీహెచ్ చైత్ర, డి.చరణ్ సాయి ఫణీశ్వర్, టి.వెంకట అలితేష్ చౌదరి ఎంపికైనట్లు ఫెన్సింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జి.నవీన్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు, కోచ్ రాజు, జి.అనీల్‌లను ప్రకాశం జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర అధ్యక్షుడు వి.నాగేశ్వరరావు, ప్రకాశం జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు, ఫెన్సింగ్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు కూనపరెడ్డి శివశంకర్ అభినందించారు.

చెక్‌బౌన్స్ కేసులో జైలుశిక్ష

ఒంగోలు: చెక్ బౌన్స్ కేసులో 6 నెలల జైలుశిక్ష విధిస్తూ రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి షేక్ రోషన్ గురువారం తీర్పునిచ్చారు. కుటుంబ అవసరాల నిమిత్తం టి.ఎలిజబెత్ రాణి అనే మహిళ 2014లో తన వద్ద రూ.5 లక్షలు తీసుకున్నారని, బాకీ చెల్లింపు నిమిత్తం 2017లో రూ.6.20 లక్షలకు తనకు చెక్కు ఇచ్చినట్లు జె.రమేష్‌బాబు న్యాయస్థానంలో ఫిర్యాదుచేశారు. కేసు పూర్వాపరాలను విచారించిన న్యాయమూర్తి నిందితురాలు ఎలిజబెత్ రాణిపై నేరం రుజువైనట్లు పేర్కొంటూ ఆరు నెలల జైలుశిక్ష, రూ.7.10 లక్షల పరిహారం, జరిమానా చెల్లించాలని తీర్పు ఇచ్చారు.

194 మద్యం బాటిళ్లు స్వాధీనం



ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

కంభం: మండలంలోని తురిమెళ్ల గ్రామంలోని బెల్టుషాపులపై గురువారం ఎక్సైజ్ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. దాడిలో రాజేంద్ర అనే వ్యక్తి వద్ద 194 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ కొండారెడ్డి తెలిపారు. మద్యం బాటిళ్లను సీజ్ చేసి సదరు వ్యక్తిని గిద్దలూరు మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచామన్నారు. తనిఖీల్లో ఎక్సైజ్ సిబ్బంది రంగనాయకులు, శివాజీ, బాష, షంషీర్, రాజగోపాల్ పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాల రికవరీకి రంగం సిద్ధం

ఒంగోలు వన్‌టౌన్: ఎస్సీ కార్పొరేషన్ రుణాల రికవరీకి రంగం సిద్ధమైంది. ఈ మేరకు తాడేపల్లి అధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ జే అర్జున్ నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సక్రమంగా రుణాలను తిరిగి ప్రభుత్వానికి చెల్లించలేదన్నారు. దీంతో రుణాల రికవరీకి ఏపీ రాష్ట్ర షెడ్యూల్ కులాల సహకార ఆర్థిక సంఘం లిమిటెడ్ రుణ వసూళ్ల కోసం లక్ష్యాలు నిర్దేశించినట్లు తెలిపారు. దీని ప్రకారం లబ్ధిదారులు వద్ద నుంచి రూ.94 లక్షలు రికవరీ చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా జిల్లా అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఇప్పటికే లబ్ధిదారులకు రుణాల చెల్లింపునకు 60 నెలల గడువు ముగిసిందన్నారు. లబ్ధిదారులు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో సంప్రదించి వారు చెల్లించాల్సిన బకాయిలను తెలుసుకుని చెల్లించాలన్నారు.

ఆగని పచ్చమూకల ఆగడాలు

అధికారం అండగా పచ్చమూకలు రెచ్చిపోతున్నాయి. ఆ మూకల దోపిడీకి అడ్డూ అదుపు లేకుండా పోతోంది. అన్నీ తెలిసినా అధికారులెవ్వరూ వారి దౌర్జన్యాలకు అడ్డుకోలేకపోతున్నారు. మండలంలోని వెంకటకృష్ణాపురంలో గ్రామకంతం భూములే ఇందుకు ఉదాహరణ. గ్రామకంతం భూములు ఆక్రమించి శాశ్వత కట్టడాలు నిర్మిస్తున్నా అధికారులెవ్వరూ ఆ వైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం.



వెంకటకృష్ణాపురంలో అక్రమ కట్టడాలను అడ్డుకుంటున్న మహిళలు



వేలు చూపుతూ బెదిరిస్తున్న టీడీపీ సానుభూతిపరుడు కొండూరి శ్రీను

- గ్రామ కంఠాన్ని ఆక్రమించి శాశ్వత కట్టడాలు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని రెవెన్యూ అధికారులు
- న్యాయం చేయాలని తహసీల్దార్‌కు బాధితుల ఫిర్యాదు

మర్రిపూడి:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామాల్లో ఆ పార్టీ నేతల దౌర్జన్యాలు శృతిమించుతున్నాయి. గ్రామ కంఠ భూమిని తెలుగుదేశం సానుభూతిపరులు యథేచ్ఛగా ఆక్రమించి శాశ్వత కట్టడాలు నిర్మిస్తున్నారు. ఇదేమని ప్రశ్నించిన వారిపై దాడులకు దిగుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా ఆ వైపు కన్నెత్తి చూడటం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని వెంకటకృష్ణాపురం సర్వే నంబర్ 15లో 9.92 ఎకరాల గ్రామకంతం భూమి ఉంది. అందులో 0.51 సెంట్ల భూమిలో అదే గ్రామానికి చెందిన బొట్లగుంట సత్యన్నారాయణ, బొట్లగుంట వెంకట కృష్ణయ్య కుమారులు శ్రీను, తిరుపాలు కొన్ని దశాబ్దాలుగా గడ్డివాములు, పశువులు, గేదెలను మేపుకుంటూ నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన కొండూరి వెంకటేశ్వర్లు కుమారుడు శ్రీను గ్రామకంతాన్ని ఆక్రమించి శాశ్వత కట్టడాలు నిర్మిస్తున్నాడు. ఆ గ్రామ కంతం భూమిపై టీడీపీ శ్రేణుల కన్ను పడిందని, ఆక్రమించేందుకు గుంటలు తీస్తున్న తురుణంలో ఈ నెల 16న గ్రామకంతంస్వాహా అనే శీర్షికను సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. అయినా అధికారులు, పోలీసులు పట్టీపట్టనట్లు వ్యవహరించారు. ఇదే అదునుగా భావించిన టీడీపీ నేతగురువారం గ్రామ కంతం భూమిలో శాశ్వత కట్టడాలు నిర్మించేందుకు పిల్లర్లు తీసి అడ్డబీములు సైతం వేస్తున్నారు. పిల్లర్లు, అడ్డబీములు పోసేందుకు గ్రామంలో కూలీలు ఎవరు రాకపోవడంతో పక్క ప్రాంతాల నుంచి కూలీలను పిలిపించారు. అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారన్న విషయం తెలుసుకున్న హక్కుదారులు అక్రమ కట్టడాలను అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఒకరినొకరు నెట్టుకోవడంతో మహిళ కింద పడిపోయింది. ఈ పరిస్థితుల్లో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇంత జరుగుతున్నా అధికారులెవ్వరూ ఆ వైపు కన్నెత్తి కూడా చూడలేదు. తరాల నుంచి అనుభవిస్తున్న నా భూమిని కొండూరి వెంకటేశ్వర్లు, కొండూరి శ్రీనులు దౌర్జన్యంగా ఆక్రమించి అక్రమ కట్టడాలు కడుతున్నారని, విచారించి తగు న్యాయం చేయాలంటూ వెంకటకృష్ణాపురం గ్రామానికి చెందిన బొట్లగుంట శ్రీను తహసీల్దార్ బి.జనార్ధకు వినతి పత్రం అందజేశారు.

అబద్ధాలు చెప్పడం బాబుకు అలవాటు



సమావేశంలో మాట్లాడుతున్న చుండూరి రవిబాబు, పక్కన నేతలు

- వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు

ఒంగోలు సిటీ: అబద్ధాలు చెప్పడం చంద్రబాబుకు అలవాటని, ఏడాదిలో ఏం చేయలేని చేతకాని ప్రభుత్వం ఇది అని వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు ధ్వజమెత్తారు. స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇన్నేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు జనాలను ఉద్ధరించానని చెప్పుకోవడానికి ఒక్క పథకం అయినా ఉందా అని ప్రశ్నించారు. వెలిగొండ ప్రాజెక్టును ఎప్పుడు పూర్తి చేస్తారో చెబితే బాగుండేదన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొగాకు రైతుల కోసం జిల్లా పర్యటనకు వచ్చి ప్రభుత్వాన్ని నిద్ర లేపారని, దీంతో కేంద్రమంత్రి పీయూష్‌గోయల్, కేంద్ర మంత్రి కార్యదర్శులు ఒంగోలు పొగాకు బోర్డుకు దిగివచ్చి సమావేశాలు పెట్టి పొగాకు కొనుగోలు చేస్తామని చెప్పారన్నారు. కానీ ఇంత వరకు పొగాకు రైతులకు ఒనగూరిన ప్రయోజనం ఏంలేదన్నారు. లోగ్రేడ్ పొగాకును కేంద్ర ప్రభుత్వం సగం, రాష్ట్ర ప్రభుత్వం సగం వేసుకొని కొనుగోలు చేస్తామని చెప్పారని, కానీ ఇంత వరకు మార్కెట్ ఎందుకు రాలేదని ప్రశ్నించారు. చిన్న చిన్న సంఘటనలను పెద్దవి చేసి డైవర్షన్ రాజకీయాలు చేస్తూ ప్రజల సమస్యలను పక్కదారి పట్టిస్తున్నారని మండిపడ్డారు. జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న లక్షలాది ప్రజల ఆదరణ చూసి ఓర్వలేక ఇటువంటి పనులు చేస్తున్నారని విమర్శించారు. ఓ పక్క చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు రెచ్చగొట్టేలా ప్రకటనలు చేస్తూ మరో పక్క మాపైనే నిందలు వేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. సీఎం చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ మాట్లాడే భాషలను ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో బుద్ధి చెబుతారన్నారు. గంజాయి విచ్చలవిడిగా రవాణా అవుతున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదన్నారు. గంజాయి మత్తులో బ్యాచ్ ఒక సీఐపై దాడి చేశారని, ఇళ్ల మీదకు వెళ్లి ఆడపిల్లలపై దాడి చేస్తున్నారని, ఎవ్వరికీ రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. గంజాయి అమ్మినవాడిని పట్టుకుంటే ఎవరు సరఫరా చేస్తున్నారో తెలియదా.. పోలీసులు తలుచుకుంటే ఎంత పని అన్నారు. టీడీపీ వారే గంజాయి వ్యాపారం చేస్తున్నారని, అందుకే పోలీసులు అడ్డుకట్ట వేయలేకపోతున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, కొత్తపట్నం మండల అధ్యక్షుడు లంకపోతు అంజిరెడ్డి, ఒంగోలు మండల అధ్యక్షుడు మన్నే శ్రీనివాసరావు, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, కార్పొరేటర్ ఇమ్రాన్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల ఆందోళన



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు, వీఆర్‌ఓలు

మార్కాపురం టౌన్: విధులకు హాజరైనా మున్సిపల్ కమిషనర్ జీతాలు కట్ చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని, న్యాయం చేయాలని పట్టణ పరిధిలోని వార్డు సచివాలయ ఉద్యోగులు గురువారం సబ్‌కలెక్టర్ త్రివినాగ్‌కు వినతిపత్రం అందచేశారు. విధులకు హాజరైనా జీతాలు కట్ చేయడం శోచనీయమన్నారు. ఇలా అయితే తామెలా ఉద్యోగాలు చేయాలని ఆందోళన వ్యక్తం చేశారు. వేతనాలు ఎందుకు కట్‌చేశారని కమిషనర్‌ను అడిగితే నో వర్క్...నో పే అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడం సమంజసం కాదని వారు సబ్‌కలెక్టర్‌కు తెలిపారు. సచివాలయ ఉద్యోగుల అరియర్స్, బిల్లులపై సంతకాలు చేసేందుకు బిల్లును బట్టి తమకు పర్సంటేజీలు ఇవ్వాలని మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న గుమస్తా డిమాండ్ చేయడాన్ని సబ్‌కలెక్టర్ ఎదుట ఉద్యోగులు వాపోయారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మార్కాపురం మున్సిపల్ కమిషనర్ సిబ్బందిపై నిరంకుశధోరణితో వ్యవహరిస్తున్నారని, న్యాయం చేయాలని కోరారు. మే నెలలో కొన్ని సచివాలయాల్లో పనిచేస్తున్న వీఆర్‌ఓలకు జీతాలు తగ్గించారన్నారు. విచారణ చేసి తమకు న్యాయం చేయాలని కోరారు.

కలెక్టర్‌ను అభినందించిన ఎన్‌జీఓ నాయకులు



కలెక్టర్‌ను అభినందిస్తున్న ఏపీఎన్‌జీఓ అసోసియేషన్ జిల్లా నాయకులు

ఒంగోలు సబర్బన్: జిల్లా కలెక్టర్‌గా ఏ.తమిమ్ అన్సారియా ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ నాయకులు ప్రత్యేకంగా అభినందించారు. గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో కలిసిన అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.శరత్ బాబు, కార్యదర్శి ఆర్‌సీహెచ్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కె.శరత్‌బాబు బంగారు బాల్యం కార్యక్రమానికి స్కాచ్ అవార్డ్ సాధించి దేశంలోనే జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపారని, భవిష్యత్‌లో కూడా జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తారన్నారు. కార్యక్రమంలో ఒంగోలు పట్టణ అధ్యక్షుడు కొత్తపల్లి మంజేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు పి.రామాంజనేయులు, సంయుక్త కార్యదర్శి షేక్ మోమిన్, రాష్ట్ర మహిళా విభాగం కన్వీనర్ పి.మాధవి, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు కె.కోటేశ్వరమ్మ, ఒంగోలు పట్టణ ఉపాధ్యక్షులు షేక్ కరీముల్లా, వి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కట్టడికి చర్యలు



నేర సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్



నేర సమీక్షలో పాల్గొన్న డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు

- నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్: గంజాయి కట్టడి విషయంలో నిర్లక్ష్యం వద్దని, గంజాయి అరికట్టేందుకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశించారు. జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలతో స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలోని గెలాక్సీ భవనంలో గురువారం నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. దర్యాప్తులో ఉన్న హత్య, పోక్సో, లైంగిక దాడులు, ఆర్థిక నేరాలు, మిస్సింగ్ కేసులు, రోడ్డు ప్రమాదాలతో పాటుగా పెండింగ్ కేసులు, ఎన్‌ఫోర్సుమెంట్ విషయాలపై సమీక్షించారు. పోలీస్‌స్టేషన్ల వారీగా కేసుల నమోదు, నిందితుల అరెస్టు, విచారణకు సంబంధించిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్పీ మాట్లాడుతూ గంజాయి వంటి నిషేధిత మాదక ద్రవ్యాల రవాణా, విక్రయాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మాదక ద్రవ్యాల సేవించడం వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరించాలన్నారు. గంజాయి వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సైబర్ నేరాలు ఎక్కువైపోతున్న క్రమంలో ప్రజలు సైబర్ నేరాల బారిన పడి నష్టపోకుండా తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామస్థాయిలో సైబర్ నేరాలపై అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలన్నారు. చోరీ కేసుల్లో నిందితులను పట్టుకునేందుకు, సొత్తు రికవరీకి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. దొంగతనాలు, దోపిడీలపై గట్టి నిఘా వేయాలని, నైట్ బీట్స్ బలోపేతం చేయాలని, నిత్యం తనిఖీలు నిర్వహించాలని సూచించారు.

పాత నేరస్తులపై నిఘా

పాత నేరస్తులు, చెడు నలత కలిగిన వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రదేశాలను గుర్తించి అక్కడ సైన్ బోర్డులు, బారికేడ్లను ఏర్పాటు చేయాలని చెప్పారు. యాక్సిడెంట్‌కు సంబంధించిన ఎఫ్‌ఏఆర్, ఐఏఆర్, డీఏఆర్ రిపోర్టులను నిర్ణీత కాలవ్యవధిలో ఎంఏసీటీ కోర్టుకు పంపించాలని, విస్తృతంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ నిర్వహించాలన్నారు. పోక్సో కేసులపై కాలేజీలు, పాఠశాలలో అవగాహనా కార్యక్రమాలను నిర్వహించాలని, పిల్లలకు బ్యాడ్ టచ్, గుడ్ టచ్‌ల గురించి అవగాహన కల్పించాలన్నారు. రానున్న లోక్‌అదాలత్‌లో వీలైనంత ఎక్కువ కేసులను రాజీ చేసేందుకు ప్రయత్నించాలని సూచించారు. పోలీసు అధికారులు , సిబ్బంది క్రమశిక్షణతో వ్యవహరించాలని, అంకితభావంతో పనిచేయాలని చెప్పారు. సమర్థవంతమైన సేవల ద్వారా పోలీసు శాఖకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. నేర సమీక్షలో డీఎస్పీలు నాగరాజు, లక్ష్మీ నారాయణ, రమణ కుమార్, డీసీఆర్బీ సీఐ దేవ ప్రభాకర్, ఐటీకోర్ సీఐ సూర్య నారాయణ, ఎస్సీ ఎస్టీ సెల్ సీఐ దుర్గా ప్రసాద్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

కలల సాకారానికి చదువే మార్గం

- జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ



విద్యార్థి నోట్ పుస్తకాలు తనిఖీ చేస్తున్న జేసీ

పుల్లలచెరువు: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ అన్నారు. మండలంలోని నరజాములతండాలో గురువారం పర్యటించి పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో ఉన్న మౌలిక వసతులు, విద్యార్థులకు అందచేసిన కిట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థుల నోట్‌పుస్తకాలను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. విద్యార్థులకు అధునిక పద్ధతిలో బోధన చేయాలని సూచించారు. ప్రస్తుతం విద్యార్థుల భవిష్యత్‌కు చక్కటి అవకాశాలు ఉన్నాయని, కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు చేరుకునేందుకు సులభ మార్గాలు ఉన్నాయని సూచించారు. ప్రతి విద్యార్థి కలలు కని, వాటిని నిజం చేసుకోవాలంటే చదువు ఒక్కటే మార్గమన్నారు. ప్రతి రోజు విద్యార్థులను పాఠశాలలకు పంపేలా చూడాలని తల్లిదండ్రులకు సూచించారు. సబ్‌కలెక్టర్ వెంకట త్రివినాగ్, డీఎఫ్‌ఓ సందీప్‌కృపాకర్, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, సర్పంచ్ బాలునాయక్ పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరు



సమావేశంలో మాట్లాడుతున్న చీకటి శ్రీనివాసరావు

ఒంగోలు టౌన్: కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరక విధానాలపై పోరాటం చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ వర్కర్స్ ఫెడరేషన్ గౌరవాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో గురువారం ఫెడరేషన్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జులై 9వ తేదీన జరగనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వంతో కలిసి చంద్రబాబు ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానలను అవలంబిస్తుందని మండిపడ్డారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి పూర్తిగా లొంగిపోయిందని, కార్మికులకు 10 గంటల పనిదినాలను ప్రవేశపెట్టడం దుర్మార్గమన్నారు. మహిళల హక్కులకు భంగం కల్పిస్తూ రాత్రి వేళల్లో డ్యూటీలు వేయడం ఎంత మాత్రం సమర్థనీయం కాదని, దీన్ని ప్రజలంతా వ్యతిరేకించాలని కోరారు. బ్రిటీష్ కాలం నుంచి అమలవుతున్న కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్‌ను అమల్లోకి తీసుకురావడం ద్వారా కార్మికుల శ్రమశక్తిని కార్పొరేట్లకు దోచిపెట్టేందుకు ప్రయత్నాలు చేస్తుందని మండిపడ్డారు. కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయకుండా, ఉద్యోగ భద్రత కల్పించకుండా చేస్తుందని విమర్శించారు. టి. విజయమ్మ, కె. పద్మ, అనిత, సుబ్బరాయుడు, ఆర్.శ్రీనివాసరావు, పోకల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

అరకొర వసతులతో కౌన్సెలింగ్

- ఇబ్బందులు పడిన విద్యార్థులు, తల్లిదండ్రులు



పాఠశాలలో గట్లపై సేదతీరుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

సింగరాయకొండ: ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో చేరే విద్యార్థులకు స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. కౌన్సెలింగ్‌కు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు. అయితే వందల సంఖ్యలో వచ్చిన వారికి సరైన వసతులు కల్పించడంలో గురుకుల పాఠశాల యాజమాన్యం తీవ్ర నిర్లక్ష్యవైఖరి అవలంబించారని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడ్డారు. వచ్చిన వారి కోసం చాలీచాలని షామియానా వేశారు. కనీసం కుర్చీలు కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో చెట్ల కింద పడిగాపులు కాయాల్సి వచ్చింది. పాఠశాలలో తరగతి గదులు ఖాళీగా ఉన్నా ఆ గదుల్లో వసతులు కల్పించకుండా ఎండకు వదిలేయడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రమాదవశాత్తు సౌకతోట దగ్ధం

- రూ.40 వేల ఆస్తినష్టం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక శాఖాధికారులు

టంగుటూరు: ప్రమాదవశాత్తు సౌకతోట దగ్ధమైంది. ఈ సంఘటన మండలంలోని ఆలకూరపాడు గ్రామ మూసీ ఒడ్డున గురువారం సాయంత్రం జరిగింది. వివరాల్లోకి వెళితే..మండలంలోని ఆలకూరపాడు నుంచి ఈతలముక్కల దారిలో మూసీ ఒడ్డున వి.రంగారెడ్డి సౌకతోటలో ఎవరో ఆకతాయిలు సిగిరెట్ తాగి పడేయడంతో నిప్పులు చెలరేగాయి. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. రూ.40 వేల ఆస్తినష్టం సంభవించింది.